క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత



చెక్కు అందిస్తున్న సహకార సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): నాయీ బ్రాహ్మణుల పరస్పర సహాయక సహకార పొదుపు, పరపతి సంఘంలో సభ్యులైన ఎం శ్రీనివాసులు మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుమార్తె ఎం. సుకన్యకు రూ.50 వేల చెక్కును అందించడం జరిగిందని సంఘం సీఈఓ/ కార్యదర్శి ఎం స్వామిచంద్రుడు తెలిపారు. బుధవారం స్థానిక శ్రీ సద్గురు త్యాగరాజ సీతారాముల దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ సహకార సంఘంలో 903 మంది సభ్యులు ఉన్నారన్నారు. 17 సంవత్సరాలుగా సంఘం విజయవంతంగా కొనసాగుతుందని, ఈ సంఘంలోని సభ్యులు ఎవరైనా మృతి చెందితే సంఘంలోని ఆదరణ పథకం ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి ఎం. ఈశ్వరయ్య, పాలక మండలి సభ్యులు ఎం. మల్లికార్జున, మునిస్వామి, రాజ్‌కుమార్, న్యాయవాది బాల సుబ్రమణ్యం, కింగ్స్ ప్రసాద్, జగదీష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రచయిత అజీజ్‌కు సాహితీ పురస్కారం



అజీజ్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న ఆచార్య తంగెడ కిషన్‌రావు, అల్లం నారాయణ

కర్నూలు కల్చరల్:హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పుర స్కారం -2021ను కర్నూలుకు చెందిన ప్రముఖ రచయిత ఎస్‌డీవీ అజీజ్ అందుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయంలో జరిగిన పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్ రావు, తెలంగాణ మీడియా అకాడమీ అధ్యక్షుడు అల్లం నారాయణ పురస్కారాన్ని ప్రదానం చేశారు.అజీజ్ రచించిన 'తుర్రెబాజ్ ఖాన్'నాటకం ఉత్తమ గ్రంథంగా ఎంపికకావడంతో అజీజ్‌కు తెలుగువిశ్వవిద్యాలయం పురస్కారం వరించింది. అవార్డు అందుకున్న అజీజ్‌కు జిల్లాలోని సాహితీసంస్థల ప్రతినిధులు,సాహితీ వేత్తలు శుభాకాంక్షలు తెలిపారు.

జానపద కళాకారులకు చేయూత ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెంచలయ్య

కర్నూలు(సెంట్రల్): గ్రామీణ ప్రాంతాల్లోని జానపద కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత ఇవ్వాలని ఏపీ ప్రజా నాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ముఖ్య జనపద కళాకారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు హుస్సేన్, శశికళ, మాస్టర్ చిరంజీవి, మధు,శివ, రాంబాబు, మహేష్, కృష్ణ పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): నంద్యాల ఇంటిగ్రేటెడ్ బీసీ బాలికల వసతి గృహ వార్డెన్ సువర్ణ తీరుపై ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ హెచ్‌ఆర్‌సీలో ఫిర్యాదు చేసింది. 9వ తరగతి చదువుతున్న ఓ బాలికను వార్డెన్ ఇంటికి తీసుకెళ్లి పనులు చేయించుకోవడంతోపాటు చిత్రహింసలకు గుర్తి చేస్తుండడాన్ని టీఎస్ఎఫ్ నాయకులు గుర్తించారు. వార్డెన్ బారి నుంచి ఆ బాలికను తప్పించి బుధవారం వార్డెన్ తీరుపై హెచ్‌ఆర్‌సీలో ఫిర్యాదు చేయించారు. హాస్టల్‌లో చదువుకునే బాలికలతో ఇంటి పనులు చేయించుకోవడం హేయమని, వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప డిమాండ్ చేశారు.

అయ్యప్ప స్వామి భక్తుల మాలధారణ



భక్తులకు మాలధారణ చేస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ పూజారి బాలస్వామి

కర్నూలు కల్చరల్: కార్తీక మాసం ప్రారంభం కావడంతో బుధవారం నగరంలోని భాస్కర్ నగర్ అయ్యప్పస్వామి ఆలయం, సప్తగిరినగర్‌లోని మణికంఠ అయ్యప్పస్వామి ఆలయాల్లో అయ్యప్ప భక్తు లు దీక్ష స్వీకరించారు. భక్తుల అయ్యప్ప స్వామి శర ణు ఘోషతో ఆలయాలు మార్మోగాయి. అంతకు ముందు అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు. సుమారు 800 మంది భక్తులు అయ్యప్ప దీక్ష స్వీకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

జగనన్నతోనే పేదలకు మేలు

- ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారు
- అవినీతికి తావులేకుండా పాలన
- మోసం చంద్రబాబు నైజం
- 'వై ఏపీ నీడ్స్ జగన్'లో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హాఫీజ్‌ఖాన్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక 4, 51వ వార్డుల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జెండావిష్కరణ చేసి, అక్కడి ప్రజలకు సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. 2014-19 మధ్య చంద్రబాబు పాలన, ప్రస్తుతం వైఎస్ జగన్ పాలనకు మధ్య తేడాను ప్రజలకు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్ఆర్ లాగే సీఎం వైఎస్ జగన్ పేదల కష్టాలు తెలిసిన నాయకుడన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనకడుగు వేసే నాయకుడు కాదన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచే ఆచరణలో పెట్టి మూడు నెలల్లోనే 80శాతం, నాలుగున్నరేళ్లలో 99 శాతం పూర్తి చేసిన ఏకైక నేత జగన్ అన్నారు. 2014లో అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తమ కార్యకర్తలకు లబ్ధి చేకూర్చేందుకే జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేశారని, ఆయన తమ వర్గానికి తప్ప పేదలకు చేసిన మేలు శూన్యమన్నారు. ప్రస్తుతం వైఎస్ఆర్‌సీపీ పాలనలో రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. అవినీతికి తావు లేకుండా నేరుగా అర్హుల ఖాతాల్లోకే పథకాల సొమ్ము జమచేస్తున్నామన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో చంద్రబాబు మభ్యపెట్టేందుకు వస్తున్నారని, ఆయనను నమ్మితే మరోసారి మోసపోతారని ప్రజలను చైతన్యం చేశారు. కార్యక్రమంలో 4వ కార్పొరేటర్ అర్షియా పర్వీన్, 51వ వార్డు ఇన్‌చార్జ్ కృష్ణకాంత్, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఆదిమోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు వాసు, కృష్ణకాంత్‌రెడ్డి, జుబేర్, షేక్ అహ్మద్ నాయకులు రియాజ్ బాబా, మాబు, శేషు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ప్రజా శ్రేయస్సుకు పెద్దపీట

- మరోసారి వైఎస్ జగన్‌ను గెలిపించుకుందాం
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 34వ వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ పథకాలు అందిస్తున్న ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం కల్లూరు అర్బన్ 34వ వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సంపత్ నగర్ వార్డు సచివాలయంలో 33 రకాల సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం జగన సుపరిపాలన అందిస్తున్నారన్నారు. 2019 ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారన్నారు. దీనిని ఓర్వలేక ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, తిప్పి కొట్టాలని ప్రజలను కోరారు. అనంతరం బళ్లారి చౌరస్తాలో జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ క్లస్టర్-2 అధ్యక్షుడు(కార్పొరేటర్) శ్రీనివాసులు, కల్లూరు అర్బన్ జేసీఎస్ ఇన్‌చార్జ్ ఎ.హనుమంతురెడ్డి, కార్పొరేటర్లు వెంకటేశ్వర్లు, సుదర్శన్‌రెడ్డి, నారాయణరెడ్డి, శ్వేతారెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు కృష్ణమూర్తి, నాయకులు రంగప్ప, హనుమంతయ్య, తిరుపాల్, విష్ణువర్ధన్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్లు దుర్గప్రసాద్, నాగేష్, రాజేశ్వరి, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- క్రిస్టియన్ విభాగం ప్రభుత్వ సలహాదారు రెవరెండ్ డాక్టర్ బాలస్వామి



క్రైస్తవుల సదస్సులో మాట్లాడుతున్న రెవరెండ్ డాక్టర్ ఫాదర్ బాలస్వామి

కర్నూలు (టౌన్) : క్రైస్తవుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని క్రిస్టియన్ విభాగం ఏపీ ప్రభుత్వ సలహాదారు రెవరెండ్ డాక్టర్ ఫాదర్ యం. బాల స్వామి అన్నారు. బుధవారం నగర శివారులోని జీవసుధ హాలులో దైవ సేవకులు, క్రైస్తవ నాయకుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కర్నూలు నగరంలో క్రైస్తవుల ఆస్తులు, చర్చిలను పరిశీలించారు.వివిధ అంశాలపై క్రైస్తవ నాయకులు, పాస్టర్లు అందజేసిన వినతులను స్వీకరించారు. అనంతరం ఏర్పా టు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని చెప్పారు. క్రైస్తవుల ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుందన్నారు. జెరూసలేంయాత్రకు రాయితీ ఇస్తుందన్నారు.కార్యక్రమంలో చర్చి పాస్ట ర్లు చొరప్ప, సోలోమెన్, విజయ్‌కుమార్, సునీల్, జయకాంత్ క్రిస్టియన్, జెట్టి. ప్రభుదాస్, జాషువ దా ని యల్, ఏలియా, జాన్ విల్సన్, అబ్రోజ్ పాల్గొన్నారు.

క్షయ బాధితులకు పోషకాహారం పంపిణీ



పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం ద్వారా క్షయ వ్యాధి బాధితులకు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వారు బుధవారం పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని జిల్లా క్షయ నివారణ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య మాట్లాడుతూ జిల్లాలోని 1898 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డిప్యూటీ డీఎం ఎస్‌హెచ్. నరసింహరావు, ఈఎస్(హెచ్‌ఆర్) ఎన్.శివలక్ష్మి, ఇంజినీర్ షాలమ్ షేక్‌షావలి, డీఎల్ఏటీవో డాక్టర్ ఎల్.భాస్కర్, ఎంటీడీటీసీ డాక్టర్ జి. మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మరింత మెరుగైన సేవలు

- పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి



బయోకెమిస్ట్రీ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ తదితరులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు మరింత సౌకర్యవంతమైన వైద్యసేవలు అందించే దిశగా అడుగులు వేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ చెప్పారు. బుధవారం ఆసుపత్రిలోని నూతన డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో బయోకెమిస్ట్రీ ల్యాబ్‌ను వారు ప్రారంభించారు. రోగులు పెరుగుతున్న నేపథ్యంలో వారికి అత్యున్నత ప్రమాణాలతో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రోగుల సంరక్షణ, అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఓపీడీ, ఐపీ విభాగంలో ఆటోమేటెడ్ పరికరాలతో పనిచేయగలిగిన బయోకెమిస్ట్రీ టెస్టింగ్ ప్యానెల్, సెమి ఆటో అనలైజర్ యంత్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, బయోకెమిస్ట్రీ హెచ్ఓడీ డాక్టర్ పద్మ విజయశ్రీ, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సునీల్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రయోజనాల సేవల కేసు పరిష్కారం

కర్నూలు (లీగల్) : నగరపాలక సంస్థ చేపట్టిన మురుగు కాల్వల నిర్మాణ సమయంలో మంచినీటి పైపులు ధ్వంసం కావడంతో ఓ అపార్ట్‌మెంట్‌కు దాదాపు 2 నెలల పాటు మునిసిపల్ నీరు అందలేదు. ఈ విషయాన్ని అపార్ట్‌మెంట్ వాసి, న్యాయవాది పి.సుదర్శన్ పలుమార్లు నగరపాలక అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పట్టించుకోకపోవడంతో సమస్యను శాశ్వత లోక్ అదాలత్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకట హరినాథ్, సభ్యులు శివశంకర్ రెడ్డి, డి.రాజు నగర కార్పొరేషన్ అధికారులకు నోటీసు జారీ చేయడంతో వారు స్పందించారు. మునిసిపల్ నీరు అందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో బుధవారం ఫిర్యాదుదారు పి. సుదర్శన్, మునిసిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ డి.ఎల్లారెడ్డి సమస్య పరిష్కారం చేసుకున్నట్లు లోక్‌అదాలత్ అధ్యక్షులకు తెలిపారు.

శిశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్



చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ఎన్ఐసీయూ, ఎస్ఎన్‌సీయూల ద్వారా శిశు సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం ఆయన స్థానిక ఖండేరి సచివాలయంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పక ఇవ్వాలని, ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్, యు విన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. దేశంలో ప్రతి సంవత్సరం నవంబర్ 15 నుంచి 21వ తేదీ వరకు నేషనల్ న్యూ బార్న్ వీక్ జరుపుకుంటారన్నారు. పిల్లల మనుగడ, అభివృద్ధికి నవజాత సంరక్షణ ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం ఈ వారం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఎస్ఎంఎం, ఆశాలు కలిసి ఈ వారం రోజులు వారి పరిధిలోని నవజాత శిశువులందరి జాబితాను తయారు చేయాలన్నారు. వారికి ఏవైనా అనారోగ్య సమస్యలు ఉంటే హాస్పిటల్‌కు రెఫర్ చేయాలన్నారు. ఐదేళ్లలోపు శిశు మరణాల్లో శ్వాస కోశ సంబంధిత వ్యాధులు ప్రధాన కారణమవుతున్నాయన్నారు. నిమోనియా వ్యాధి లక్షణాలైన జలుబు, దగ్గు, త్వర త్వరగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకునేటప్పుడు పక్కటెముకలు కదలడం, అధిక జ్వరం రావడం, ఏమీ తినకపోవడం వంటి లక్షణాలు ఉన్న పిల్లలకు పీసీవీ వ్యాక్సిన్‌ను తప్పక వేయించాలన్నారు. ఆ పిల్లలను దగ్గరలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రి, జనరల్ హాస్పిటల్‌కు తీసుకెళ్లాలని సూచించారు. బిడ్డకు వెచ్చదనం కల్పించాలని, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని చెప్పారు. నిమోనియా వ్యాధి గురించి ఈ నెల 12 నుంచి 2024 ఫిబ్రవరి 29వ తేది వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో డీసీఎం ప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

జీరో బ్యాలెన్స్ అకౌంట్లపై ప్రచారం

కర్నూలు(అగ్రికల్చర్): సహకార సమైక్య డిపాజిట్ పథకం కింద జీరో బ్యాలెన్స్ ఖాతాలను పెద్ద ఎత్తున ప్రారంభించేందుకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు ప్రచారానికి శ్రీకారం చుట్టారు. పోస్టర్లను ఆటోలకు అతికించడం, ముఖ్యమైన కూడళ్లలో ప్రజలకు అవగాహన కల్పించడం, కరపత్రాలు పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ ప్రత్యేక క్యాంపెయిన్ జనవరి నెల చివరి వరకు జరుగుతుందని డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.రామాంజనేయులు తెలిపారు.

నేడు 'మోసగాళ్ల దేశం' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: ప్రముఖ కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ పిల్లల కోసం హాస్యాన్ని, నీతిని కలిపి రచించిన 'మోసగాళ్ల దేశం' అనే 15 కథల సంపుటిని గురువారం మధ్యాహ్నం 2 గంటలకు అమడగుంట్ల జెడ్పీహెచ్ఎస్‌లో ఆవిష్కరిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంతయ్య తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు వర్ధమాన మెజీషియన్ పల్లెద లింగరాజుతో మ్యాజిక్ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

జీవనశైలి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): జీవనశైలి వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ సీఈఓ డాక్టర్ చంద్రశేఖర్ చెప్పారు. బుధవారం ప్రజాభ్యుదయ సంస్థ (పీఏపీ) ఆధ్వర్యంలో జెమ్‌కేర్ హాస్పిటల్ సౌజన్యంతో స్థానిక ధర్మపేటలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి గుండె, బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి వైద్యులు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో పీఏపీ అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులు కాపాడాలి

కర్నూలు(రాజ్‌విహార్): బాలల హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కర్నూలు సహాయ కార్మిక శాఖ అధికారి కేశన్న అన్నారు. బుధవారం ఆయన స్థానిక ధర్మపేటలోని తన కార్యాలయంలో కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్లలోపు చిన్నారులతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమని, ఆ వయస్సులోపు పిల్లలంతా బడుల్లో ఉండాలన్నారు. ఎక్కడైనా పని ప్రదేశాల్లో కనిపిస్తే.. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇప్పించి, స్కూళ్ల లేదా స్వచ్ఛంద సంస్థల్లో చేర్పించాలన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

కర్నూలు(రాజ్‌విహార్): అదృశ్యమైన తన భర్తను వెతికి పెడుతామంటూ ముగ్గురు వ్యక్తులు మోసం చేశారని వారిపై కేసు నమోదు చేయాలని స్థానిక సంతోష్ నగర్‌కు చెందిన ఓ యువతి నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2021లో తాను దేవనగర్‌కు చెందిన ఈశ్వర్ అనే వ్యక్తిని ఆమె ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. నాలుగు నెలల క్రితం భర్త గొడవ పడి ఇంటి నుంచి వెళ్లి వెళ్లిపోయాడు. ఆయన ఎక్కడున్నాడో వెతికి పెట్టేందుకు చంద్రశేఖర్, పరమేశ్వరి, సంధ్య అనే ముగ్గురు లక్షరూపాయలు అడగగా రూ.20 వేలు ఇచ్చానని బాధితురాలు తెలిపారు. తన భర్తను గాలించకపోగాఅసభ్యంగా మాట్లాడుతున్నారని ఆమె తన ఫిర్యాదులో వెల్లడించారు.

ఇంటింటా సంక్షేమ వెలుగులు



గార్గేయపురంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో ఇంటింటా సంక్షేమ వెలుగులు నిండాయని ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ అన్నారు. కర్నూలు రూరల్ మండల పరిధిలోని గార్గేయపురంలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం కొనసాగింది. నాలుగో రోజు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు గ్రామస్తులు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లను అందజేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తేదీలను ప్రకటించి అమలు చేస్తున్నామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయ భవనాలు, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇంటింటికీ తాగు నీటి కుళాయిలను ఏర్పాటు చేసే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. కాలనీల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, సర్పంచ్ సోమేశ్వరమ్మ, ఎంపీటీసీ జ్యోతిలత, నాయకులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై యుద్ధాన్ని ఖండించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ అజీజ్‌పాషా

కర్నూలు(సెంట్రల్): పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధాన్ని ప్రపంచ దేశాలు ఖండించాలని ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్‌పాషా విజ్ఞప్తి చేశారు. బుధవారం ఇన్సాఫ్ ఆధ్వర్యంలో ఓ హోటల్‌లో పాలస్తీనాపై ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఆపాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇజ్రాయెల్ 43 రోజులుగా పాలస్తీనాపై యుద్ధం చేస్తూ 20 వేల మంది ప్రాణాలు తీసుకుందన్నారు. ఐక్య రాజ్య సమితిలో పాలస్తీనాకు మద్దతుగా 120 దేశాలు నిలిచాయన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రసూల్ మాట్లాడుతూ..ఇజ్రాయెల్ మానవత్వం లేకుండా ప్రవర్తిస్తోందన్నారు.చిన్న పిల్లలు, మహిళలపై బాంబులు వేసి చంపడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. పాలస్తీనాకు మద్దతుగా ఐరాసలో భారత్ నిలవడం ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ సెల్ నాయకులు రజాక్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు కొత్తపేట మున్నా, టీడీపీ మైనార్టీ వింగ్ నాయకులు అబ్దుల్ సమీ మౌలానా సమీవుల్లా, నాయకులు అబూబకర్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్

వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాలు సాధించాలి



క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న అసోసియేషన్ నాయకులు

కర్నూలు (టౌన్) : ఈనెల 17 నుంచి 19 వరకు శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ జూనియర్, సీనియర్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియం చీఫ్ కోచ్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని వెయిట్ లిఫ్టింగ్ హాలులో రాష్ట్ర పోటీల్లో పాల్గొనే జట్టును ప్రకటించారు. ఎంపికయిన క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. పురుషుల జట్టులో డీజీ వీరేష్, కె. వీరేష్, అబ్దుల్లా, అబ్దుల్ హక్, కె. శివ, నరసింహ నాయక్, మన్సూర్, పర్వేజ్, మహిళల విభాగంలో వెంకటలక్ష్మి, తులసీ, నాగమణి ఎంపికయ్యారు.బాలాజీ ఆప్టికల్స్ అధినేత అంజనేయగౌడ్, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ యూసుఫ్‌బాష పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులతో నగర మేయర్ బీవై రామయ్య

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని, దీంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కర్నూలు నగర పాలక సంస్థ మేయర్ బీవై రామయ్య అన్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని బళ్లారి చౌరస్తాలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో మేయర్ ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయ స్వామి దీక్షా స్వాములకు అన్నదానం చేశా రు. కార్యక్రమంలో ఆలయం ఈఓ దినేష్,అర్చకులు మనోహర్ శర్మ, శ్యామ్ సుందర్, శ్రీకాంత్ నాయుడు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి మంజూరు

కర్నూలు సిటీ: సి.బెళగల్ మండలం చింతమానుపల్లె గ్రామానికి చెందిన హోసూరు మంజులకు అమెరికన్ అంకాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో చికిత్స కోసం సీఎం సహా య నిధి నుంచి రూ.3లక్షలు మంజూరు అయ్యాయి. ఈ మేరకు బుధవారం కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ గార్గేయపురంలో భాధితులకు మంజూరు పత్రాన్ని అందజేశారు.కర్నూలు ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సేవల్లో నిర్లక్ష్యం చేయొద్దు

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారులకు సేవలందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించరాదని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీరు వై. సుబ్బన్న ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక పవర్ హౌస్‌లోని తన కార్యాలయంలో కింది స్థాయి ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కనెక్షన్ పొందిన ప్రతి ఒక్కరికీ సేవలందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.